క్లుప్తంగా

పెదపులివర్రులో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి ప్రారంభించారు. ఈ సర్వేలో భాగంగా 7 రకాల పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు నిష్ణాతు లైన డాక్టర్లతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తా రని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శారద, ఎంఎల్‌హెచ్‌పీ కె.ఆశాజ్యోతి, ఏఎన్ఎం లీలారాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిన బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శ్రీఘ్రముగా వివాహం జరగాలని ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు.

21న నాగదేవత జయంత్యుత్సవాలు

కోనేటిపురం(భట్టిప్రోలు): కోనేటిపురం కోటిపడగల పుణ్యక్షేత్రమైన వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో వెలిసిన నాగ దేవత 58వ జయంతి వార్షికోత్సవాలు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాలస్వామి, ఆస్థాన పండితులు వంగర చలమయ్య సిద్ధాంతి, జొన్నా వెంకటరత్నం గురుస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గీతా గురూజి పందిరి శ్రీశైలం గురూజీ ద్వారా సత్సంగం జరుగుతుందని, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి ఎంపీ ఆర్థిక సాయం

రేపల్లె రూరల్: పేటేరు పంచాయతీలోని భూపతి ప్రసాద్ కుమారుడు ధనుష్ మంగళవారం ఆకస్మికంగా మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు మృతుని కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్ రూ.5వేలు అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. న్యాయవాది అల్లంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు ఉన్నారు.

త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాప్ ప్రారంభం



బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల 3డీ ప్రింటింగ్, అప్లికేషన్స్ వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బీకేసీ గణేష్ పాల్గొన్నారు. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ నవీకరణ ప్రాముఖ్యతను వివరించారు. మానం నాగేశ్వరరావు ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందించారు. ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్స్ దొబ్బలపూడి రామ్మోహన్ రావు, గెల్లి దిలీప్ కుమార్ మాట్లాడుతూ 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ, వివిధ రంగాల్లో అప్లికేషన్‌లను అన్వేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, కన్వీనర్ డాక్టర్ టి. నాంచారయ్య, విభాగాధిపతి, ప్రిన్సిపల్ డాక్టర్ నజీర్, కో–ఆర్డినేటర్లు డాక్టర్. బి.ఇషే కార్ హుస్సేన్, ఎస్.విజయ్ పాల్గొన్నారు.

27న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలి: ఈనెల 27వ తేదీ డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసూనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ రీజినల్ ఆఫీస్, విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. తపాల సేవలు పొందటంలో ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆ రోజున సాయంత్రం 4 గంటల వరకు ఫిర్యాదు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీలోగా తమ ఫిర్యాదులను లెటరు ద్వారా తెనాలి కొత్తపేటలోని తమ కార్యాలయానికి పంపాలని కోరారు. కవరుపై డాక్ అదాలత్ అని రాసి పంపించాలని వివరించారు.

దండాలయ్యా..ఉండ్రాలయ్యా

- వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు
- వాడవాడాల కొలుదీరిన గణనాథుడి ప్రతిమలు
- ఆకట్టుకున్న భారీ మండపాలు, వివిధ రూపాల విగ్రహాలు
- గణనాథుడి పూజలో తరించిన భక్తులు



గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కోన రఘుపతి



భట్టిప్రోలు విఠలేశ్వరనగర్ కాలనీలో గణనాథుడు

బాపట్ల: వినాయక చవితి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో వాడవాడలా భారీ వినాయక విగ్రహాలను నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేశాయి. భక్తులు బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో వర్ణరంజితంగా తీర్చిదిద్దారు. గణేషునికి వివిధ రకాల పత్రాలు, ఫలాలు, పుష్పాలు, పసుపు, కుంకుమలతో చిన్నారులు, పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో బాపట్లలోని శివాలయంలో ఏర్పాటు చేసిన మండపంలో ఎమ్మెల్యే కోన రఘుపతి తన మనవడితో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, తన్నీరు అంకమ్మరావు, ఆట్ల ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలోని 15 గ్రామాలలో ఈ ఏడాది 40 విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిదని ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు. విఠలేశ్వరనగర్‌లో వార్డు సభ్యుడు బండారు దిలీప్ కుమార్–మాధవి, వెల్లటూరు ఎస్టీ కాలనీలో సర్పంచ్ చౌటూరి లక్ష్మి రవీంద్ర దంపతులు పాల్గొన్నారు. అద్దేపల్లి ఎస్టీ కాలనీలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ బూర్లె అరుణ కుమారి, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నిర్వాహకులు పాల్గొన్నారు. విఠలేశ్వరనగర్‌లో నిర్వహించిన స్వామి వారి లడ్డును రూ. 17,100కు బండారు దిలీప్ కుమార్ కై వశం చేసుకున్నారు. సోమవారమే కొన్ని గ్రామాల్లో వినాయకుని నిమజ్జనాలు జరిగాయి.

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలోని సిద్ధి బుద్ధి సమేత గణపతి దేవాలయంలో నవరాత్రి మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్వామికి ప్రత్యేక అభిషేకాలు. పూజలు, అర్చనలు శాస్త్రయుక్తంగా జరిపారు. 9వ రోజు గణపతి హోమం జరుగుతుందని దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.



అద్దేపల్లి ఎస్టీ కాలనీలో వినాయకునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్ధి బుద్ధి సమేత గణపతి



నిజాంపట్నంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎంపీటీసీ మోపిదేవి హరనాథబాబు



పిట్టలవానిపాలెంలో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



దుండివారిపాలెంలో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



నగరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

పిట్టలవానిపాలెం: మండలంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. మన్నెంవారిపాలెం, కప్పలవారిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని విగ్రహాలను ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి, తెనాలి–నిజాంపట్నం పంట కాలువలో నిమజ్జనం చేశారు.

నగరం: వినాయక చవితి పర్వదిన వేడుకలను మండలంలోని ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలో ఏర్పాటుచేసిన గణనాథుడికి ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ప్రత్యేక పూజలు చేశారు.

కర్లపాలెం: వినాయక చవితి వేడుకలు మండలంలో సోమవారం వైభవంగా జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నిజాంపట్నం: వినాయక చవితి వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. నిజాంపట్నం, అడవులదీవి, కొత్తపాలెం, కూచినపూడి, దిండి, అముదాలపల్లి, పల్లపట్ల, ముత్తుపల్లి, కళ్లిఫలంతో పాటు పలు గ్రామాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి హరనాథబాబు నిజాంపట్నంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీటీసీ నాజర్‌ఖాన్, సహకార సొసైటీ అధ్యక్షుడు మరకా శ్రీనివాసరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ మోపిదేవి దంపతుల ప్రత్యేక పూజలు



ఉప్పూడి రోడ్డులో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ మోపిదేవి దంపతులు

రేపల్లె రూరల్: వినాయక చవితి వేడుకలు నియోజకవర్గంలో సోమవారం వైభవంగా జరిగాయి. ప్రతి ఇంట విఘ్నేశ్వర పూజలు నిర్వహించుకుని భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. అదే విధంగా పట్టణంలోని విఘ్నేశ్వర దేవాలయాల్లోనూ పూజలు నిర్వహించారు. ఓల్డ్‌టౌన్‌లో ఆర్యవైశ్యులు, రైలుపేటలో వర్తక సంఘాలు, పెద కూరగాయల మార్కెట్, మార్కెట్ సమీపంలోని విఘ్నేశ్వరుని ఆలయం, రంగా బొమ్మ సెంటరులోని విఘ్నేశ్వరుని ఆలయంలో పూజలు వైభవంగా నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, అరుణ భాస్కరి దంపతులు పట్టణంలోని పలు పందిళ్ళల్లోని విఘ్నేశ్వరుని విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కమిటీల నిర్వహకులకు ఆర్థిక చేయూతనందించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, నియోజకవర్గ నాయకుడు మోపిదేవి రాజీవ్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మోహనరావు

వేమూరు: రాజకీయ నాయకులు ఓటరు జాబితా సరవణపై ప్రత్యేక దృష్టి సారించాలని నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి జె. మోహనరావు సూచించారు. వేమూరు తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని ఆయన చెప్పారు. నియోజకవర్గంలో పోలింగ్ బూతులు ఏర్పాటులో సమస్యలు లేకుండా చూస్తామన్నారు. రాజకీయ నాయకులు సహకారం పూర్తి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాదె శివరామ కృష్ణా రెడ్డి, దొప్పలపూడి జ్యోతిబాబు, దండే సుబ్బారావు, రామ కృష్ణ, తహసీల్దారు నాగరాజు, దుర్గా పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య రక్ష.. శ్రీరామరక్ష



మహిళ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రేపల్లె రూరల్: జగనన్న ఆరోగ్య రక్ష పథకంలో భాగంగా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని 5వ వార్డులో ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటా కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరమైన సమస్యలు తెలుసుకుని వైద్యసేవలు అందించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీలా లక్ష్మణబాబు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రుషి పంచమి వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో బుధవారం రుషి పంచమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బూర్లె అరుణ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాతాజీ సరస్వతమ్మ, జ్ఞాన చైతన్య, పసుపులేటి వేణుగోపాలస్వామి ఆశీస్సులతో ఆధ్యాత్మిక వేత్తలను సప్త రుషులుగా భావించి, పూజించనున్నట్లు పేర్కొన్నారు.

తాపీ ధర్మారావు చిరస్మరణీయుడు



తాపీ ధర్మారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తెనాలి: ప్రజల భాషను అన్నిరంగాల్లో వ్యాప్తి చేయాలనే ధ్యేయంతో జీవితాంతం కృషి చేసిన తాపీ ధర్మారావు చిరస్మరణీయులని సాహితీ ప్రముఖుడు బి.లలితానంద ప్రసాద్ అన్నారు. పట్టణ గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో మంగళవారం సాయంత్రం తాపీ ధర్మారావు జయంతిని జరిపారు. ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. అభ్యుదయ రచయితల సంఘం మూలస్తంభాల్లో ఒకరైన తాపీ ధర్మారావు ప్రజల సాహిత్యానికి విశేష ప్రాచుర్యం కల్పించారని చెప్పారు. ప్రజల భాషను సినిమా రంగానికి కూడా తీసుకెళ్లారని సోదాహరణంగా చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభలు తెనాలిలో జరిగినపుడు ధర్మారావు అధ్యక్షత వహించినట్టు లలితానంద ప్రసాద్ గుర్తుచేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత, కవి అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ పాత్రికేయునిగా, రచయితగా, పరిశోధకుడిగా, సినిమా సంభాషణల రచయితగా, జీవితాంతం కమ్యూనిస్టుగా మెలిగిన తాపీ ధర్మారావు జీవిత విశేషాలను వివరించారు. సభలో ఇస్కఫ్ నాయకులు పి.నారాయణరావు, బొల్లిముంత కృష్ణ, వెనిగళ్ల ప్రసాద్, ఎంవీ రఘునాథరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, విజయదుర్గ, కవి ఆళ్ల నాగేశ్వరరావు, వంగా సుదర్శనరెడ్డి, అంబటి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత తాపీ ధర్మారావు చిత్రపటానికి నివాళులర్పించారు.

తాపీ ధర్మారావుకు నివాళి

తెనాలిఅర్బన్: తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సహజకవి అయిన డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ సాహితీవేత్త తాపీ ధర్మారావు జయంతిని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. అనంతరం ఏపీడబ్ల్యూయూజే జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పర సుధాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్, ఈఎల్‌వీ అప్పారావు, పీపీ అవధాని, లక్కరాజు లక్ష్మణరావు, భీమేశ్వరప్రసాద్, డాక్టర్ తన్నీరు కళ్యాణ్‌కుమార్, అడపా సంపత్‌రాయుడు, తదితరులు పాల్గొన్నారు. అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో తాపీ ధర్మారావు జయంతిని గాంధీనగర్‌లోని ఇస్కాఫ్ కార్యాలయంలో మంగళవారంసాయంత్రం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.లలితానందప్రసాద్, తాతాజీ, రామారావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా శ్రీచరణ్



రేపల్లె రూరల్: రేపల్లె తహసీల్దారుగా జి.శ్రీచరణ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఆయన రేపల్లెకు వస్తున్నారు. రేపల్లె తహసీల్దార్ మల్లికార్జునరావు సాధారణ బదిలీపై బాపట్ల కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా వెళ్లారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన ర్యాలీ



తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహాలను అరికట్టాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరావు ప్రారంభించారు. సంస్థ కో–ఆర్డినేటర్ జి.వెంకయ్య మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదని, బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో రాఘవ, మహిళా సంరక్షణ కార్యదర్శి హిందూ, ఏఎన్ఎం ఉమ, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రిక, అంగన్‌వాడీ కార్యకర్త అనూష పాల్గొన్నారు.

మార్కెట్‌లో వ్యర్థాలు తొలగింపు

తెనాలిఅర్బన్: ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ సోమవారం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా మున్సిపల్ మార్కెట్ వద్ద వ్యాపారులు విక్రయించి వదిలేసిన పత్రిని తొలగించారు. ఈసందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ఆకురాతి రామచంద్రరావు మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పండుగ రోజు కూడా విధులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు దావులూరి శ్రీనివాసరావు, పి.అనుపమ, గుమ్మడి ప్రసాద్, ఎం.సుబ్బారావు, షేక్ బాజీహుస్సేన్, వై.లక్ష్మీనారాయణ, సెక్రెటరీలు ఏ ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని



ప్రధానోపాధ్యాయురాలిని విచారిస్తున్న పోలీసులు

పొన్నూరు: ఇరువురు విద్యార్థినుల మధ్య ఏర్పడిన స్వల్పవివాదం కారణంగా విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొన్నూరులోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇరువురు విద్యార్థినినుల మధ్య డబ్బుల విషయంలో స్వల్ప వివాదం నెలకొంది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జమ్ముల శివలక్ష్మీ ఇరువురిని పిలిచి మందలించారు. అయితే తనని మాత్రమే మందలించారని మనస్థాపానికి గురైన మాచవరం గ్రామానికి చెందిన విద్యార్థిని అదే రోజు సాయంత్రం పాఠశాలలోనే ఎలుకల మందు పేస్టును చాక్లెట్‌తో కలిపి తిన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని స్కూల్లో ఎవరు గమనించకపోవడంతో విద్యార్థిని ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందించింది. స్థానికంగా ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్య చికిత్స కోసం అదే రోజు అర్ధరాత్రి మంగళగిరి ఎన్నారై వైద్యశాలకు బాలికను తరలించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అయితే బాలిక ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో మంగళవారం పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె ఆరోగ్య పరిస్థితి విషమించిందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆగ్రహానికి గురై పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. విద్యార్థుల మధ్య వివాదం చోటుచేసుకున్నా, పాఠశాలలోనే ఎలుకల మందు తిని విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి క్షీణించినా వైద్య సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఇద్దరికి స్వర్ణ పతకాలు



పతకాలు సాధించిన వారితో రామారావు, సాంబశివరావు

తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో అకాడమి క్రీడాకారులకు రెండు బంగారు, ఒక కాంస్య పతకం లభించినట్లు కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పోటీలు రేపల్లెలో ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన జి.ప్రభురాజ్, వి.నాగసతీష్, స్నేహలతలను మంగళవారం తెనాలిలోని అకాడమీ ఆవరణలో అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అచ్యుత, సాంబశివరావు, కొత్త రామారావు, పాల్గొన్నారు.

రుణమాఫీకి కేంద్రం చర్యలు తీసుకోవాలి

తెనాలి: కేంద్ర ప్రభుత్వం రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు కోరారు. రైతు సంఘం మండల కమిటీ సమావేశం రూరల్ మండల గ్రామం జగ్గడిగుంటపాలెంలో మంగళవారం ముద్దన సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు రుణ మాఫీ చేస్తూ దేశవ్యాప్తంగా రైతాంగానికి ఉన్న రూ.2.5 లక్షల కోట్లను మాఫీ చేయకపోవటం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికల్లో రైతుల రుణమాఫీ సమస్యను అజెండాలోకి తీసుకురావాలని కోరారు. తొమ్మిది గంటల విద్యుత్ నిరంతరాయంగా అందించి పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులు, కౌలురైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 25వ తేదీలోగా రైతుభరోసా కేంద్రాల్లో అర్జీలను ఇవ్వాలని, 25న మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని, రబీ పంటలు వేసుకునేందుకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలని కోరారు. ఈనెల 23న తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగే జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, బొంతా సాంబశివరావు, తాడిబోయిన మాధవరావు, దొడ్డక పుల్లయ్య, నల్లమేకల నాగేశ్వరరావు, గండు వెంకటేశ్వర్లు, కాటిపల్లి వెంకటేశ్వర్లు, ఆదిన గోపి పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడిపై హత్యాయత్నం

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడిపై ముగ్గురు యువకులు బీరు సీసాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాలు... స్థానిక చెంచుపేట ఓవర్ బ్రిడ్జి డౌన్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో సోమవారం సాయంత్రం గండికోట సాంబశివరావు అలియాస్ సాంబపై కొందరు యువకులు బీరు సీసాలతో దాడి చేశారు. గతంలో చెంచుపేటలో జరిగిన రౌడీ షీటర్ మత్తే ప్రశాంత్ హత్య కేసులో సాంబ ఏ2 నిందితుడిగా ఉన్నా డు. ఆ కేసులో అరెస్టై ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. వినాయక చవితి పండుగ కావడంతో తెనాలిలో ఉన్న తన సోదరుడిని చూసేందుకని సాంబ పట్టణానికి వచ్చాడు. మధ్యాహ్నం బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగుతుండగా ముగ్గురు యువకులు వచ్చి అతడిపై బీరు సీసాలతో దాడి చేశారు. సాంబ తల, ముఖంపై విచక్షణారహితంగా దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తీసుకు వెళ్లారు. దాడికి పాల్పడింది గతంలో హత్యకు గురైన మత్తే ప్రశాంత్ స్నేహితులు శ్రీకాంత్, నాగరాజు, మనోహర్‌గా గుర్తించారు. స్నేహితుడి హత్యకు ప్రతీకారంగానే సాంబశివరావుపై హత్యాయత్నం చేపినట్టు తెలుస్తోంది. ముగ్గురు నిందితులు ప్రస్తుతం త్రీ టౌన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.